క్లుప్తంగా

ఈవీఎం గొడౌన్ తనిఖీ



ఈవీఎం గొడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

నెల్లిమర్ల: ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచే నెల్లిమర్లలోని ఈవీఎం గోదాంను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శనివారం తనిఖీ చేశారు. గోదాం షట్టర్లకు వేసిన సీళ్లను, సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ పి. సుదర్శనరావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాస్కరరావు, ఎన్నిక డీటీ జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

సవరవిల్లిలో పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీఓ వెంకటేశ్వరరావు, తదితరులు

పూసపాటిరేగ: భోగాపురం మండలం సవరవిల్లి బీసీ కాలనీలో చేపడుతున్న పారిశుధ్య పనులను జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు శనివారం పరిశీలించారు. మురుగు కాలువను శుభ్రం చేయడంతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ గాయత్రి, ఎంపీటీసీ సభ్యుడు పి.తాతయ్యలు, తదితరులున్నారు.

రూ. కోటితో అభివృద్ధి పనులు



శ్మశానంలో బోరు ఏర్పాటు పనులు

పూసపాటిరేగ: మండలంలోని కొవ్వాడ గ్రామంలో సుమారు కోటి రుపాయల సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు సర్పంచ్ కోట్ల రఘు తెలిపారు. ఈ మేరకు శ్మశానంలో బోరుబావి ఏర్పాటు పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివాలయం అభివృద్ధి, క్రీడా మైదానం అభివృద్ధి పనులు ఇప్పటికే ప్రారంభించామన్నారు. గ్రామస్తుల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దేబార్కి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరి



సంగీత కచేరీ చేస్తున్న ఆముక్త మాల్యద

విజయనగరం టౌన్: ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్థానిక ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో ఎం. ఆముక్తమాల్యద సుష్మ ఆలపించిన సంగీత కచేరి ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. వయోలిన్‌పై హనుమంతు రామచరణ్, మృదంగంపై డాక్టర్ మండపాక రవి సహకరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడు దూసి శివరామ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తత తప్పనిసరి

విజయనగరం: ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైతే తప్ప బయటకు రాకుండా జాగ్రత్త వహించాలన్నారు.

మంచినీరు ఎక్కువగా తాగాలని సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు రావాల్సి వస్తే టోపీలు, కాటన్ దుస్తులు, కళ్లద్దాలు ధరించాలన్నారు. మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ వంటివి ఎక్కువగా తీసుకోవాలన్నారు.

విరాళాల సేకరణ

బొబ్బిలి: పోలియో నిర్మూలన చర్యల కోసం స్థానిక పట్టణంలోని పలు కూడళ్లలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ శనివారం చేపట్టారు. వారం రోజులుగా సేకరిస్తున్న ఈ నిధులతో రోటరీ క్లబ్ ద్వారా చేపట్టే సేవా కార్యక్రమాలకు వినియోగిస్తామని క్లబ్ అధ్యక్షుడు రాజు మాస్టారు తెలిపారు.

గ్రామస్థాయి ప్రణాళికలతో వృద్ధి రేటు..

- నెల్లిమర్ల నియోజకవర్గంలో పరిశ్రమ, సేవా రంగాల వృద్ధికి అవకాశాలు
- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు చర్యలు
- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

నెల్లిమర్ల: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్దేశించిన విధంగా జిల్లాలో 15 శాతం వృద్ధిరేటు సాధించేందుకు గ్రామస్థాయి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. మండల, గ్రామ స్థాయిలో వృద్ధిరేటు, తలసరి ఆదాయం, జీవీఏ, తదితర అంశాలపై అవగాహన కల్పించే క్రమంలో జరజాపుపేటలోని ఓ కల్యాణ మండపంలో నెల్లిమర్ల నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అందుబాటులో ఉన్న వనరులు, స్థానిక పరిస్థితుల ఆధారంగా ప్రణాళికలు రూపొందించాల్సిన బాధ్యత గ్రామస్థాయిలో పనిచేసే సిబ్బందిపై ఉందన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో నెలాఖరు నాటికి స్థానిక పరిస్థితుల ఆధారంగా, అక్కడి వనరులతో వృద్ధి రేటు సాధనకు ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. జిల్లా ప్రజల తలసరి ఆదాయం పెరగాలంటే ప్రాథమిక రంగమైన వ్యవసాయ, అనుబంధ రంగాల ద్వారా రైతుల ఆదాయం పెంచాలని సూచించారు. వ్యవసాయ రంగంలో సాగు విస్తీర్ణం పెంచడం, బహుళ పంటలను పండించడం, పంటల ఉత్పాదకత పెంపుదల, నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు సాధించడం ద్వారా వ్యవసాయ రంగంలో ఆదాయాన్ని పెంచవచ్చని కలెక్టర్ చెప్పారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని ఇచ్చే పంటలపై దృష్టి సారించాలని వ్యవసాయాధికారులు, సిబ్బందికి సూచించారు. రబీలోనూ సాగు విస్తీర్ణం పెంచాల్సి ఉందని, పంటలకు అవసరమైన సాగునీటి వసతి కల్పించేందుకు జిల్లాలో పుష్కలంగా ఉన్న భూగర్భ జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాల్సి ఉందని చెప్పారు. సాగుకు అనుకూలతలు కలిగి ఉండి సాగులో లేని 1.20 లక్షల ఎకరాలను వచ్చే ఐదేళ్లలో సాగులోకి తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. అలాగే జిల్లాలో పరిశ్రమల రంగం ద్వారా ఉపాధి అవకాశాలు పెంచేందుకు 6,600 చిన్న పరిశ్రమలను పునరుద్ధరించే ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఒక చిన్న పరిశ్రమల పార్కు ఏర్పాటు చేయబోతున్నామని, దీనికోసం ఇప్పటికే ఏపీఐఐసీకి 280 ఎకరాలు కేటాయించామన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, మత్స్య పరిశ్రమ, ఉద్యాన పంటల సాగు ద్వారా కూడా ఆదాయం పెంపొందించుకొనే అవకాశం ఉందని.. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

అవకాశాలు పుష్కలం..

నెల్లిమర్ల నియోజకవర్గంలో పరిశ్రమ, సేవా రంగాల్లో వృద్ధికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. భోగాపురం విమానాశ్రయం పూర్తయితే పెద్ద ఎత్తున హోటల్స్ ఏర్పాటై సేవారంగం అభివృద్ధి చెందుతుందన్నారు. బీచ్ కారిడార్ ఏర్పాటు ద్వారా పరిశ్రమ, సేవారంగాల్లో ఆదాయం పెరిగే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 14,447 ఎకరాల్లో ఈ ఏడాది వ్యవసాయ సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఉద్యాన అధికారి ఏవీఎస్‌వీ జమదగ్ని మాట్లాడుతూ.. నెల్లిమర్లలో 900 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. నియోజకవర్గంలో ప్రస్తుతం 4,500 ఎకరాల్లో ప్రకృతి సేద్యం జరుగుతోందని.. దీన్ని 6,500 ఎకరాలకు పెంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రకృతిసేద్యం డీడీ ఆనందరావు చెప్పారు. సూక్ష్మసేద్యం ద్వారా వ్యవసాయోత్పత్తి పెంచవచ్చని ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ తెలిపారు. పశుపోషణ, కోళ్ల పెంపకం, గొర్రెలు, మేకల పెంపకం ద్వారా అధిక ఆదాయం సాధించేందుకు అవకాశాలు ఉన్నాయని.. రైతుల్లో దీనిపై అవగాహన కల్పించాలని పశుసంవర్ధక శాఖ అధికారి వైవీ రమణ అన్నారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాలను గ్రామ ప్రణాళికల తయారీలో భాగస్వామ్యం చేస్తామని నియోజకవర్గ ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు చెప్పారు. ముఖ్య ప్రణాళిక అధికారి పి.బాలాజీ మాట్లాడుతూ.. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇతర మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుర్ల మండలం జమ్ముపేటకు చెందిన కురిమినెల్లి శ్రీనివాస్ అనే రైతు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన భాస్మతి రకాల ధాన్యంను కలెక్టర్ పరిశీలించి, పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతు శ్రీనివాస్ దంపతులను సత్కరించారు.

• వైభవంగా మాసశివరాత్రి పూజలు



ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థాన ఆలయ క్షేత్ర పాలకుడిగా విరాజిల్లుతున్న ఉమా సదాశివాలయంలో మాస శివరాత్రి పూజలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. అర్చకుడు రేజేటి మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. ముందుగా గణపతి ఆరాధన అనంతరం శివుడికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫలరసాలతో విశేష అభిషేకాలు జరిపించారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక హోమాలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

– నెల్లిమర్ల రూరల్

• అన్నదానం



విజయనగరంలోని కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో మాస శివరాత్రిని పురస్కరించుకుని ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి నేతృత్వంలో శనివారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమణమ్మ, మారమ్మ, ప్రసాద్, శోభారాణి, భీమ, సోమశేఖర్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

–విజయనగరం టౌన్

నిబంధనలు ఉల్లంఘిస్తే సహించం



సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ విజయలక్ష్మి

- కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్



హాజరైన సభ్యులు

విజయనగరం: కార్పొరేషన్ నిబంధనలను ఉల్లంఘించి ఎటువంటి పనులు చేపట్టినా సహించేది లేదని స్టాండింగ్ కౌన్సిల్ అధికారులను హెచ్చరించింది. శనివారం స్థానిక నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. అజెండాలో పొందుపరిచిన 35 అంశాలను చర్చించిన అనంతరం కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశం అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రజావసరాలను తెలుసుకుని వాటిని పరిష్కరించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామన్నారు. అన్ని డివిజన్ల ప్రజల అవసరాలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చేపట్టిన ముందస్తు ప్రణాళికలు సత్ఫలితాలనిస్తున్నాయని చెప్పారు. ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది పక్షపాతం లేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో కమిషనర్ పల్లి నల్లనయ్య, సహాయ కమిషనర్ కె.అప్పలరాజు, స్టాండింగ్ కమిటీ సభ్యులు అల్లు చాణిక్య, జీవీ రంగారావు, రేగాన రూపాదేవి, సుంకరి నారాయణ స్వామి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దర్బార్‌ను సందర్శించిన డీఆర్‌డీఏ మాజీ చైర్మన్



సతీష్‌రెడ్డిని బాబా శేషవస్త్రాలతో సత్కరిస్తున్న ఖలీల్‌బాబు

విజయనగరం టౌన్: యువ సమ్మేళనం కార్యక్రమానికి జిల్లాకు వచ్చిన డీఆర్‌డీఏ మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి శనివారం స్థానిక బాబామెట్టలోని ఖాదర్‌వలీబాబా దర్బార్ దివ్యక్షేత్రాన్ని దర్శించారు. ఆయనతో పాటు నాసాకి ఎంపికైన ఇండియన్ ఆస్ట్రోనాట్ దంగేటి జాహ్నవి హాజరై బాబా ఆశీస్సులందుకున్నారు. దర్బార్ నిర్వాహకులు ఖలీల్‌బాబు వారికి బాబా శేషవస్త్రాలతో సత్కరించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఏటీకే వెలుగు వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. టెర్రాకోట్ మట్టి పాత్రల తయారీని పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అహ్మద్‌బాబు, కుశ్రూబాబు, రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్య ప్రాంతాల్లో పోలీసుల తనిఖీలు



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపడుతున్న డీఎస్పీ శ్రీనివాస్, వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, తదితరులు

విజయనగరం క్రైమ్ : పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ముఖ్య కూడళ్లలో పోలీసులు శనివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. రద్దీ ప్రదేశాలైన ఆర్టీసీ కాంప్లెక్స్, ఐనాక్స్, రైల్వేస్టేషన్, సీఎంఆర్ జంక్షన్‌లలో సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు వరకు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. అలాగే రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న హోటల్స్‌లలో జాగిలాలతో సోదాలు చేపట్టారు. కేంద్ర హోంశాఖ ఆదేశాలతో అన్ని రాష్ట్రాలలో పోలీసులు పాకిస్థానీయుల ఏరివేతకు జల్లెడ పడుతున్నారు. ఈ మేరకు విజయనగరం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో కూడా తనిఖీలు ముమ్మరం చేశారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ శ్రీనివాస్, వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, పోలీస్ జాగిలం రుబీ, ట్రైనర్ భరత్, వన్‌టౌన్ సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం..



మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న చెరుకూరి నాగరాజు

విజయనగరం టౌన్: పొట్టి శ్రీరాముల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా చెరుకూరి నాగరాజును నియమించినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వేణుగోపాల్ తెలిపారు. ఈ మేరకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా శనివారం నియామకపత్రాన్ని అందజేశారు. చెన్నయ్‌లో పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేసిన ఇల్లును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభివృద్ధి చేసి స్మృతి భవనంగా మార్చాలని కోరారు. అలాగే శ్రీరాములుకు భారతరత్న వచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆలవెల్లి శేఖర్ నియమితులైనట్లు చెప్పారు. కార్యక్రమంలో డిమ్స్ రాజు, ఆరిసెట్టి సందీప్, పూసర్ల మోహన్, కాపుగంటి శ్రీనివాస్, సముద్రాల నాగరాజు, పూసర్ల సాయి, మామిడి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

30న విధులకు హాజరుకాలేం..



డిప్యూటీ తహసీల్దార్ స్వర్ణకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏల సంఘ అధ్యక్షుడు గురుమూర్తి

విజయనగరం గంటస్తంభం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఏప్రిల్ 30న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్న నేపథ్యంలో ఆ రోజు విధులకు హాజరుకాలేమని వీఆర్ఏలు స్పష్టం చేశారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ స్వర్ణకుమార్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘ జిల్లా అధ్యక్షుడు కె.గురుమూర్తి మాట్లాడుతూ.. గ్రామ రెవెన్యూ సహాయకులుగా పైకి విధులు నిర్వహిస్తూ, అంతర్గతంగా ఆఫీస్‌లో అటెండర్లుగా, స్వీపర్లుగా, డ్రైవర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా పని చేయాల్సి వస్తోందన్నారు. వీఆర్‌ఏలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు, కార్యదర్శులు ప్రసాద్, రాజు, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఉపేంద్రరావు

వంగర: గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం, సారా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాజాం రూరల్ సీఐ హెచ్ ఉపేంద్రరావు సూచించారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని మగ్గూరులో శనివారం రాత్రి బస చేసిన ఆయన.. గ్రామస్తులకు మత్తు పదార్థాలు తీసుకోవడం కలిగే దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు–వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్‌శంకర్, ఏఎస్ఐ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీకార చర్య తీసుకోవాల్సిందే..



విజయనగరం గంటస్తంభం: కోట జంక్షన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

విజయనగరం గంటస్తంభం: పెహల్గామ్ ఉగ్రదాడికి సంబంధించి ప్రతీకార చర్య తీసుకోవాల్సిందేనని సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ తీసుకునే ఏ నిర్ణయానికైనా తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక కోట జంక్షన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాడిలో 28 మంది భారత పౌరులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. పాకిస్తాన్‌పై ప్రతీకారం తీర్చుకునే సమయం ఆసన్నమైందని, కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు రాజకీయాలకు అతీతంగా అందరూ మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.రమణ, వి.లక్ష్మి, ఆర్.ఆనంద్, వి.రాజగోపాల్, ఎం.శ్రీనివాస, తదితరులు పాల్గొన్నారు.

దాడిని ఖండించిన ముస్లింలు

విజయనగరం టౌన్: జాతి, మత విద్వేషాలను మరిచి భారతీయులమంతా ఐక్యంగా కలిసి ఉందామని సూఫీ మార్గనిర్దేశి డాక్టర్ ఎం.డి.ఖలీలుల్లా షరీఫ్ పిలుపునిచ్చారు. పహల్గావ్ ఉగ్రవాద దాడిని ఖండిస్తూ బాబామెట్టలోని బాబా దర్గాలో ఇమామ్ ఇద్రీస్ రజా ఆధ్వర్యంలో స్థానిక ముస్లింలు, పెద్దలతో కలిసి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ముజాఫర్‌బాబా, మైనారిటీ నాయకులు సిద్ధిక్, అహ్మద్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం టౌన్: దర్బార్ ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ఖలీల్‌బాబు, తదితరులు

ఆయుర్వేద వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వైద్య తనిఖీలు చేస్తున్న వైద్యాధికారి సునీల్‌కుమార్

రేగిడి: ప్రజలకు అందుబాటులో ఉండే ఆయుర్వేద వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ కోరారు. మండలంలోని అంబకండి గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన 124 మందికి వైద్య తనిఖీల అనంతరం చ్యవన్ ప్రాస్ లేహ్యాన్ని, తైలాన్ని అందించారు. అనంతరం ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.గోవిందనాయుడు, ఎంపీటీసీ పి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.